E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: TELANGANA   సంపుటి : 01   సంచిక : 130 శుక్రవారం, ఏప్రిల్ 17, 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 08   వెల :05/-

## మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- బొలెరోను ఢీకొన్న రెడీమిక్స్ వాహనం
- ప్రమాదంలో 8మంది మృతి..పలువురికి గాయాలు
- మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు



**కర్నూలు,ఏప్రిల్ 16 :** కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే మిగతా2లో...

## మహిళా బిల్లుతో
# చరిత్ర సృష్టిద్దాం


● ఇందులో ఎలాంటి రాజకీయం లేదు ● 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు ● వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత ● చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం ● ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు ● ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది ● దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు ● ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు ● డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు ● మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు మిగతా2లో...

## దేశవ్యాప్తంగా మండుటెండలు

- అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 ):** దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగా లంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగతా2లో...

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి


- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి
- ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్
- అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి
- అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ మిగతా2లో...

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు
# హైకోర్టు నోటీసులు

- మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ జూన్ 6కు వాయిదా



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసులో ఫిరాయింపుదారులుగా చెబు తున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మిగతా2లో...

## డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

- ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు


2లో



## తెలంగాణలో 17 నుంచి 26కు
# ఎంపిల సంఖ్య

- ఎపిలో 25 నుంచి 38కి పెరుగుదల
- డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 :** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై మిగతా2లో...

## మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు
- మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ -పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు.

మిగతా2లో...



## రాజ్యసభ సభ్యులుగా సింఘ్వీ, వేం ప్రమాణం

**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి గురువారం పార్లమెంట్ భవనంలో రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి వాణి వినిపిస్తానని చెప్పారు. నరేందర్‌రెడ్డికి మంత్రులు సీతక్క, శ్రీహరి అభినందనలు తెలిపారు.

## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
- దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు



**హైదరాబాద్,ఏప్రిల్ 16 :** తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి మిగతా2లో...

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

**హైదరాబాద్,ఏప్రిల్ 16** కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచం దర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చా ట్‌గా మాట్లాడారు. గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి స్జబెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు స్జబెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ది పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదని రామచందర్ రావు అన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ÷నాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా,తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాన్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో

# మంత్రాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్తంగా మండుటెండలు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పు లు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వా డా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

# తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులో తెలిపింది. ఆ తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశిం చింది. విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకటరావు, సంజరుకుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజరు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

# మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టు కుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేక పోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

(మొదటి పేజీ తరువాయి)

పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు.

## వడుప్సా (ట్రస్మా) వరంగల్ డివిజన్ ఉపాధ్యక్షునిగా డా.సామల శశిధర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**తెలుగు గళం న్యూస్ వరంగల్ ఏప్రిల్ 16**




వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్‌లోని నలంద హై స్కూల్‌లో వడుప్సా (ట్రస్మా) వరంగల్ డివిజన్ అధ్యక్షులు బొల్లం కనకయ్య అధ్యక్షతన ప్రైవేట్ పాఠశాలల డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం మరియు ఎన్నికలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ ఎన్నికల్లో భాగంగా కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన శ్రీ సాయి విజ్ఞాన్ భారతి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డిని వరంగల్ డివిజన్ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యక్రమానికి ముఖ్య అతిథులైన ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి ఎన్. రమేష్ రావు, ఎన్నికల కన్వీనర్ రాష్ట్ర సలహాదారు కే. భూపాల్ రావు తెలిపారు.జిల్లా ముఖ్య సలహాదారు చంద్రారెడ్డి, సలహాదారు ఆర్. రవి, డివిజన్ ముఖ్య సలహాదారు ఎస్. సుధాకర్, సలహాదారు విద్యాసాగర్ ఎన్నికల కో-కన్వీనర్లుగా వ్యవహరించారు. గతంలో డివిజన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విశేష సేవలు అందించిన శశిధర్ రెడ్డిని ఈసారి ఉపాధ్యక్షునిగా ఎన్నుకోవడం సంతోషకరమని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు చల్ల నాగార్జున రెడ్డి, కార్యదర్శి భాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి డి. రామ్మూర్తి, రాష్ట్ర సహాయకార్యదర్శి ఎం.క్యూ.ఏ. బేగ్, జిల్లా సహాయకార్యదర్శి రాజేందర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు అశోక్ తదితరులు, అలాగే వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.తనపై విశ్వాసంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులకు మరియు పాఠశాలల కరస్పాండెంట్లకు డా. సామల శశిధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## 70 మంది పిటిషనర్లకు ఆర్ డ ఆర్ ప్యాకేజ్ ఇవ్వాలి-హైకోర్టు కీలక ఆదేశాలు



**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఏప్రిల్ 16**

తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ ముందు విచారణకు వచ్చిన రెడ్ ఆపిల్ నం. 434 ఆఫ్ 2026 కేసులో కీలక తీర్పు వెలువడింది. 2013 చట్టం ప్రకారం పునరావాస పథకం అమలు చేయాలని పిటిషనర్లు వాదించగా, కోర్టు వారి అభ్యర్థనలను సమర్థించింది.దీంతో 70 మంది పిటిషనర్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అందజేయాలని హనుమకొండ ఆర్డీవో అధికారికి కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులో హైకోర్టు న్యాయవాదులు సిహెచ్ రవికుమార్, గద్దె అనిల్ కుమార్ సమర్థంగా వాదనలు వినిపించారు.కోర్టు తీర్పుతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం హనుమకొండలో ఆర్టిఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ మహిళా కన్వీనర్ ఎస్కే తనూజ, స్టేషన్ ఘనపూర్ బ్లాక్ ప్రెసిడెంట్ డేవిడ్ కొమురయ్య తదితరులు హైకోర్టు న్యాయవాదులను కోర్టు ప్రాంగణంలో అభినందించారు.

## అనాథ పిల్లల మధ్య ఘనంగా హర్షవర్ధన్ జన్మదిన వేడుకలు



**తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 16**

జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన మచ్చ యాకన్న -- స్వప్న దంపతులు తమ కుమారుడు హర్షవర్ధన్ జన్మదిన వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్‌ను సంప్రదించగా, అధ్యక్షులు వెంటనే స్పందించి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ సభ్యుల సమక్షంలో కుటుంబ సభ్యులు మరియు అనాథ పిల్లల మధ్య హర్షవర్ధన్ జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాలతో జరిగాయి. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు బిర్యానీ ప్యాకెట్లు, కేక్, బిస్కెట్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు దోర్ణం ప్రభాకర్ మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం గొప్ప విషయం అని యాకన్న కుటుంబాన్ని అభినందించారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ప్రత్యేక దినోత్సవాలను ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు పెదపూడి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, యాకన్న తీసుకున్న నిర్ణయం ఆదర్శప్రాయమని కొనియాడారు.తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరపడం ద్వారా వారికి ఆనందాన్ని పంచడం గొప్ప సేవ అని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా అనాథ పిల్లలు ఒక్క పూట మంచి భోజనం ఆస్వాదిస్తూ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వీరదాసు నవీన్, కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సిరినేని భూపతి రాజు

**తెలుగు గళం న్యూస్ గజ్వేల్ ఏప్రిల్ 16**




విద్యుత్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టివిఎఇ జెఎసి గజ్వేల్ డివిజన్ చైర్మన్ సిరినేని భూపతి రాజు డిమాండ్ చేశారు.గురువారం రోజు సమ్మెలో భాగంగా గజ్వేల్ డివిజన్ కార్యాలయం ముందు బతుకమ్మలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఉదయం 9 గంటల నుంచి కొనసాగిన ఈ నిరసనలో ఆర్టిజన్స్, పీస్ రేట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూపతి రాజు మాట్లాడుతూ ఆర్టిజన్స్‌కు ఎపిఎస్ఇబి రూల్స్ అమలు చేసి, వారి అర్హతలకు అనుగుణంగా కన్వర్షన్ ఇవ్వాలని కోరారు.అలాగే, అన్మాండ్ వర్కర్స్‌ను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని, పీస్ రేట్ కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం 30 రోజులలోపే వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అన్ని ఆర్టిజన్ కార్మికులకు సమాన హక్కులు కల్పించాలని, గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అన్నారు.గత ప్రభుత్వం సంస్థల విలీనంపై స్పష్టత లేకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. గతంలో రెగ్యులర్ చేసిన విధంగానే ప్రస్తుతం ఉన్న కార్మికులను కూడా రెగ్యులర్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని, కార్మికులంతా ఐక్యంగా పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ కన్వీనర్ వై. శ్రీధర్, వైస్ చైర్మన్ దూలం యాదగిరి గౌడ్, ఖలీల్ పాషా, కో కన్వీనర్ చంద్రం యాదవ్, స్వామి, కోశాధికారి కుంట కిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ్ల శ్రీనివాస్, గుర్రం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ శ్రావణ్ రెడ్డి, జంగీర్, బుచ్చిరెడ్డి, బాలకిషన్, రాజేందర్ రెడ్డి, నరేష్ రెడ్డి, లక్ష్మణ్, రమేష్ గౌడ్, గిరి యాదవ్, అమీర్, అశ్విని, ప్రియాంక, స్వప్న, సుమలత, మంగ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 16** గంట్లకుంట గ్రామానికి చెందిన జిలుకర అశోక్ కొడకండ్ల నుండి తొర్రూర్ వరకు ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, ఆయన భార్య జిలుకర రాధిక అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై, తలలో రక్త గడ్డ (బ్లడ్ క్లాట్) ఏర్పడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఈ కుటుంబం ప్రస్తుతం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయం తెలిసిన వెంటనే ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్ ద్వారా బాధిత కుటుంబ పరిస్థితిని సభ్యులకు తెలియజేశారు. దీనికి స్పందించిన సభ్యులు తమ వంతుగా సహాయం అందించగా, మొత్తం రూ.16,550/- ఫౌండేషన్ ఖాతాలో జమైంది.సేకరించిన ఈ మొత్తాన్ని గురువారం రోజు ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ సభ్యులు ప్రభుత్వ ఉపాధ్యాయులు దోర్ణం ప్రభాకర్ మరియు సూర్య రిపోర్టర్ వీరదాసు నవీన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ, గ్రామాల్లో ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఎంతో అవసరమని తెలిపారు.గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు పెద్దలు తమ వంతు సహాయం అందించడం ద్వారా ఇలాంటి కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం చూసి వెంటనే స్పందించిన సభ్యులందరినీ అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు.ప్రభుత్వ ఉపాధ్యాయులు దోర్ణం ప్రభాకర్ మాట్లాడుతూ, ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీను, కన్నె సంతోష్, పగిడిపాల రాజు తదితరులు పాల్గొన్నారు.



## జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం, క్రీడా దినోత్సవం”



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రిల్ 16(తెలుగుగళం)న్యూస్:**

సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం, క్రీడా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోపి ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సింగరేణి జీఎం చింత శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపి మాట్లాడుతూ, స్థానిక నాయకుడు మట్టా రాగమయి దయానంద్ సేవలను కొనియాడారు. కళాశాలలోని విద్యార్థులకు యూనిఫాం అవసరాన్ని తెలియజేయగా, ఎంతమంది విద్యార్థులు ఉన్నా అందరికీ యూనిఫాం అందజేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వారి చొరవతో కళాశాలలో సీసీ రహదారులు, మరుగుదొడ్లు నిర్మాణం జరిగాయని, ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి అనుమతి లభించిందని చెప్పారు.మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కళాశాల అవసరాలపై ఎమ్మెల్యేను లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు వేగం

- సుల్తాన్‌పూర్‌లో మండల స్థాయి సమీక్ష సమావేశం
- సంక్షేమ పథకాల సమర్థ అమలుకు అధికారుల దిశానిర్దేశం

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలోని రైతు వేదికలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎంపీడీవో గడ్డం రాంప్రసాద రావు అధ్యక్షత వహించగా, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశం ప్రారంభంలో “జయ జయహే తెలంగాణ” గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో గడ్డం రాంప్రసాద రావు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడం అధికారుల ముఖ్య బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, విద్య, వైద్య రంగాల్లో పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సరఫరా, రైతులకు రైతు భరోసా వంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పేర్కొన్నారు.గ్రామాల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో తహసీల్దార్ హేమ, వ్యవసాయ అధికారి సారయ్య, ఎంఈఓ రాజు, ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# 48 వ డివిజన్లోని అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పోషకాహార లోపాన్ని నివారించే దిశగా జాతీయ పోషకాహార (పోషణ్ పక్వాడ) అవగాహన సదస్సు

**- ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు**







**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / ఏప్రిల్ 17, ఖమ్మం జిల్లా :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్లో అంగన్వాడి కేంద్రాల అధ్యాపకులు మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 9వ తారీకు నుండి 23 వరకు జరిగే 8 వ ఎడిషన్ జాతీయ పోషకాహార అవగాహన సదస్సును స్థానిక సారధి నగర్ రామాలయం సెంటర్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు పాల్గొని అవగాహన సదస్సుకు హాజరైన పిల్లలు మహిళలు గర్భిణులను ఉద్దేశించి మాట్లాడుతూ పోషణ్ పక్వాడ సదస్సు భారతదేశంలో పోషకాహార లోపాన్ని తగ్గించడానికి గర్భిణీలు బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 15 రోజులపాటు నిర్వహించే ఒక జాతీయ ఉద్యమమని ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కూడిన ఒక ఉద్యమమని నేడు మనమంతా కార్పొరేట్ వ్యాపార దిగ్గజాలు లాభాపేక్షతో అందిస్తున్న ఆహారానికి అలవాటు పడి మన లైఫ్ టైం ను తగ్గించుకుంటున్నామని ఆరోగ్యకరమైన సాంప్రదాయ ఆహార అలవాట్లను పూర్తిగా మరిచిపోతు దీంతో తక్కువ వయసులోనే శారీరక శక్తిని కోల్పోయి నిస్సాయిలుగా మిగిలిపోతున్నామని మన లైఫ్ టైం ను పెంచుకునే దిశగా మన ఆరోగ్య అలవాట్లను మార్చుకోవటం మన చేతుల్లోనే ఉందని దీనికి అవసరమైన ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాలను స్వీకరించి మన ఆరోగ్య పరిస్థితిని కాపాడుకోవాలని సాంప్రదాయ ఆహార అలవాట్లను పాటించాలి. జంక్ ఫుడ్ ను నివారించాలని అనే నినాదంతో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో అంగన్వాడి ఉపాధ్యాయులు సుధా, భార్గవి, శ్రీలత, రమా, అరుణ, విజయ శ్రీ మరియు స్థానిక బిఆర్ఎస్ నాయకులు వంగాల వెంకట్, చేతి కృష్ణ, బాబా, కిషన్ నాయక్, లింగారెడ్డి, రామ్‌సింగ్ పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ

**- రూ.10 లక్షల బిల్లు పాస్‌కు రూ.30 వేలు డిమాండ్**



**నల్గొండ, ఏప్రిల్ 16 (తెలుగు గళం న్యూస్)** విద్యుత్ పనులకు సంబంధించిన బిల్లును మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన నల్గొండ జిల్లా దేవరకొండ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సిరికొండ సైదులు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. వివరాల్లోకి వెళితే...కంబాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 2025 అక్టోబర్‌లో గాలివానకు దెబ్బతిన్న 33/11 కేవీ విద్యుత్ లైన్లను ఒక కాంట్రాక్టర్ పునరుద్ధరించాడు. ఈ పనులకు సంబంధించిన రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపేందుకు ఏడీఈ సైదులు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు ప్రణాళికాబద్ధంగా ఉచ్చుపన్నించి ఏప్రిల్ 16న దేవరకొండలోని కార్యాలయంలో సైదులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో జ్యుడీషియల్ రిమాండ్ కోసం హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు పెంచాలి

- కౌలు రైతుల నుంచి మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు చేయాలి
- రైస్ మిల్లులు కేటాయింపులు చేసి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి
గన్ని సంచులు సరఫరా చేయాలి
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలకు ముగ్గురు మంత్రులు భాధ్యత వహించాలి
- తెలంగాణ రైతు సంఘం నేతలు నున్నా, బొంతు






**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం ఏప్రిల్ 17, ఖమ్మం జిల్లా :** ఖమ్మం జిల్లాలో రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేసి పంట అమ్ముటకు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ముగ్గురు మంత్రులు పట్టించుకోవడం లేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఖమ్మం సుందరయ్య భవన్ లో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ నిర్వహించిన మీడియా సమావేశంలో నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 17 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అధికారులు బుధవారం వరకు నాలుగు కొనుగోలు కేంద్రాల్లో ఒక గింజ కూడా కొనుగోలు చేయలేదు అన్నారు, కొన్ని కొనుగోలు కేంద్రాలకు మార్క్ ఫెడ్ ఐడి నెంబర్ కూడా క్రియేట్ చేయలేదు అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం లో ఒక మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మంజూరు లేదు, వైరా నియోజకవర్గంలో ఒకటి ప్రారంభం చేసిన అధికారులు రెండోవ సెంటర్ కు ఐడి నెంబర్ ఇవ్వలేదు అని అన్నారు, జిల్లా లో ఇప్పటివరకు 1982 మంది రైతులు నుంచి మొక్కజొన్న కొనుగోలు చేయడం జరిగింది అని రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయడం జరిగింది అని ఎనిమిది లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని మొత్తం పంట ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, కేంద్ర ప్రభుత్వం ఎకరాకు 26 క్వింటాళ్ల నిబంధన ఎత్తివేయాలి అని అన్నారు, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు, కౌలు రైతులు చాలా తీవ్రంగా నష్టపోతున్నారు. భూ పట్టాదారు నేరుగా కొనుగోలు కేంద్రాలకు వచ్చి వేలిముద్రలు బయోమెట్రిక్ చేయాలని ప్రభుత్వం నిబంధన వల్ల భూ యజమానులు ఇతర రాష్ట్రాలు,ఇతర దేశాల్లో ఉండటం వల్ల పంట అమ్ముకోలేని పరిస్థితి ఉందని, కొందరి వేలిముద్రలు బయోమెట్రిక్ తీసుకోవడం లేదు అన్నారు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేసిన మిల్లులు ఎలాట్ లేకపోవడం, మిల్లర్లు ధాన్యం దిగుమతి కి అంగీకారం లేకపోవడం వల్ల ధాన్యం కొనుగోలు కూడా జరగడం లేదని అన్నారు, రైతులకు అవసరమైన గన్ని సంచులు సరఫరా చేయాలి అని డిమాండ్ చేశారు, జిల్లా లో మొక్కజొన్న, వరి సాగు దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రతి రెవెన్యూ గ్రామంలో మొక్కజొన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి అని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మీరా, వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు దుగ్గి కృష్ణ,

# ఎంపీ వేం నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ గౌడ్



**తెలుగు గళం న్యూస్ వరంగల్/ఏప్రిల్ 16** వరంగల్ జిల్లా:ఇటీవల నిర్వహించిన రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. గురువారం ఆయన రాజ్యసభ సభ్యునిగా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన వేం నరేందర్ రెడ్డికి వరంగల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నకరకంటి మోహన్ గౌడ్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, తెలంగాణ అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటర్మీడియట్‌లో విశేష ప్రతిభ--కాలేజ్ టాపర్‌గా నిలిచిన సాయి ప్రణయ్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన కంప సువర్ణ -- ఐలు స్వామి దంపతుల కుమారుడు కంప సాయి ప్రణయ్ ఇంటర్మీడియట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి కాలేజ్ టాపర్‌గా నిలిచాడు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న సాయి ప్రణయ్, తాజా ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు 968 మార్కులు సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చాడు. సాయి ప్రణయ్ సాధించిన ఈ ఘనతకు గుర్తింపుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ఆయనను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు లెక్చరర్లు సాయి ప్రణయ్‌ను ఘనంగా అభినందించి సన్మానించారు. క్రమశిక్షణతో పాటు కష్టపడి చదివితే ఉన్నత విజయాలు సాధించవచ్చని ఆయన విజయంతో మరోసారి రుజువైందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బంధుమిత్రులు సాయి ప్రణయ్‌కు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన సాధించిన ఈ విజయంతో తిరుమలగిరి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చినట్లు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో రేగొండలో అభివృద్ధి జోరు

**- ఇళ్ల నిర్మాణం,ఆయిల్ ఫామ్ సాగులో ముందంజ**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశం ప్రత్యేక అధికారి ఎడ్ల సునీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించగా, మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో "జయ జయహే తెలంగాణ" గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. సీఎం ప్రసంగాన్ని ప్రత్యేక అధికారి సునీల్ కుమార్ చదివి వినిపిస్తూ, ప్రభుత్వం లక్ష్యాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, రేగొండ మండలం అభివృద్ధి కార్యక్రమాల్లో ముందంజలో ఉందని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరియు ఆయిల్ ఫామ్ సాగు పురోగతిలో జిల్లా స్థాయిలో ముందు వరుసలో నిలుస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, విద్యుత్, భూభారతి, ఐసిడిఎస్ తదితర శాఖల అధికారులు తమ తమ విభాగాల పురోగతిని వివరించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి, సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించారు. ప్రజలు కూడా సమావేశంలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రత్యేక అధికారి సునీల్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, తహసీల్దార్ కే. శ్వేత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గూటోజు కిష్టయ్య, ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, మండల సర్పంచ్ వారణాసి మౌనిక, ఎస్సై డి. సుధాకర్, వైద్యాధికారి డా. హిమబిందు, ఏవో పెద్ద వాసుదేవరెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ట్రాన్స్కో ఏఈ వంగ రాజు, ఏపీఎం ప్రేమ్ రాజ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు, యువత తదితరులు పాల్గొన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామీణ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల సహకారంతో విజయవంతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## హనుమకొండలో జాబ్ కన్సల్టెన్సీ కార్యాలయం ప్రారంభం- -యువతకు ఉపాధి దిశగా కొత్త అడుగు



**తెలుగు గళం న్యూస్ హనుమకొండ** హనుమకొండ నయీమ్ నగర్‌లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా నాయకుడు వైద్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో నూతనంగా జాబ్ కన్సల్టెన్సీ కార్యాలయం ప్రారంభించబడింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి పటేల్ రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ జాబ్ కన్సల్టెన్సీ కార్యాలయం ముఖ్య పాత్ర పోషించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో యువతకు సరైన మార్గదర్శకత్వం అవసరమని, అలాంటి సమయంలో ఇలాంటి కార్యాలయాలు వారికి దిశానిర్దేశం చేసి, ఉద్యోగ అవకాశాల సాధనలో తోడ్పడతాయని తెలిపారు.వైద్య లక్ష్మణ్ చేపట్టిన ఈ కార్యక్రమం సమాజానికి ఉపయోగకరమని, ముఖ్యంగా ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతకు ఇది ఒక వేదికగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడాలని సూచించారు.ఈ సందర్భంగా వైద్య లక్ష్మణ్ మాట్లాడుతూ యువతకు నాణ్యమైన మార్గదర్శకత్వం అందించి, వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యాలయం ద్వారా స్థానిక యువతకు ఉపయోగపడే విధంగా సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యాలయ ప్రారంభానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## దమ్మన్నపేట గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమీక్ష

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/ఏప్రిల్ 16**

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఎం. పి. డి.ఓ అధ్యక్షతన నిర్వహించిన 99రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికా రివ్యూ మీటింగ్ లో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ అందిస్తున్న ప్రజా సంక్షేమం పథకాలను ప్రజలకు చేరవేసే విషయం లో అధికారులదే కీలక పాత్ర ఈ మండలంలో 395 ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి అన్నారు. ఈ రెండున్నర సంవత్సరాలలోనే 3500 ఇండ్లు కట్టుకున్నారెంటే అతియోశక్తి కాదు ప్రతి సంవత్సరానికి ఇలానే ఇండ్లు కట్టుకుంటే ఏ గ్రామానికి వెల్లిన ఇందిరమ్మ ఇండ్లు కనిపిస్తాయి. అని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలిపిస్తామంటే ఏలన చేసినారు ఈ ఉచిత బస్సు సౌకర్యమును, రేవంత్ రెడ్డి సర్కార్ ను ఆదర్శంగా తీసుకుని తమిళనాడు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కొనసాగిస్తున్నారు, గత పాలకులు ఒక్క లక్షా రుణ మాఫీ చేయాలంటే వారు పది సంవత్సరాల అయిన చేయలేక పోయారు, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ బీమా




పథకం ముప్పది వేలు ఉండే చనిపోయిన ఇంటి యజమానికి ఆ ముప్పది వేలు పదవ రోజులోపే రెవెన్యూ అధికారులు ఆయా కుటుంబానికి అందించడం జరిగింది. ఆ స్కీమ్ కేసీఆర్ సర్కారు కనుమరుగు చేయడం జరిగింది.మళ్ళీ ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఐదు లక్షల ఇందిరమ్మ బీమా పథకం 1.15 కోటి పదిహేను లక్షల మంది కి బీమా సౌకర్యం కల్పించారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట మార్కెట్ యార్డు లో పాడి క్లీనర్లు చిన్నవి ఉండే వర్ధన్నపేట శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందిస్తూ అధికారులతో మాట్లాడి పెద్ద పాడి క్లీనర్లు ఒక్క వర్ధన్నపేట కే కాకుండా వరంగల్ జిల్లా అన్ని మార్కెట్లోకి పెద్దవి రావడం జరిగింది. కొందరు పనికి మాలిన వారు ముక్కలు కంతాలు అవుతలేవు ముక్కలు పండించిన రైతులు ఇబ్బంది పడుతున్నారు అని జుటా మాటలు మాట్లాడే వారికి ఒక్కటే సూచన మీ ప్రభుత్వాలు కనీసం ముక్కలకు మద్దతు ధర చెల్లించిశీ డ్ల కాంగ్రెస్ ప్రభుత్వం 2400 వందల మద్దతు ధర చెల్లిస్తూ ఒక్క గింజ కూడ పోనివ్వకుండా ప్రభుత్వ మే కొనుగోలు చేస్తుంది. ఈ నియోజక వర్గానికి శాసన సభ్యులు కే ఆర్ నాగరాజు వంద పడకల ఆసుపత్రి,200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, సబ్ జైల్,సబ్ కోర్టు,లు మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే కే ఆర్ కే దక్కుతుందని తెలిపారు. గత పాలకులు10 సంవత్సరాలు పాలించిన వారు వర్ధన్నపేట కు ప్రజలకు ఉపయోగ పడే పరిశ్రమో,ఏదైనా సంస్థను తెచ్చినారా? కనీసం కొనారెడ్డి చెరువు ను అయినా పట్టించుకున్న పాపాన పోలేదు ఈ రెండున్నారా సంవత్సరాల కాలం లో వర్ధన్నపేట కొనరెడ్డి చెరువును రైతులను ఆదుకున్న చరిత్ర ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు కే దక్కుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

## కొత్తపల్లి గోరీ మండలంలో ఘనంగా డిటిఎఫ్ నూతన కమిటీ ఎన్నికలు

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

కొత్తపల్లి గోరీ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) మండల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించబడ్డాయి.ఈ ఎన్నికలను జిల్లా కార్యదర్శి ఎన్నికల పరిశీలకులు ఇప్పకాయల వీరేశం పర్యవేక్షణలో సజావుగా నిర్వహించారు.ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రాచమల్ల కృష్ణమూర్తి (ఎస్ఏ మ్యాథ్స్, జెడ్పీహెచ్ఎస్ చిన్న కొడపాక), ప్రధాన కార్యదర్శిగా నాంసాని జయప్రకాష్ (ఎస్జీటీ, ఎంపిపిఎస్ కోనరావుపేట) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె. రాజమౌళి (ఎస్ఏ బయో, జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి గోరీ), ఏ. శిరీష (ఎస్జీటీ, ఎంపిపిఎస్ జగ్గయ్యపేట) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా జి. రాజేందర్ (ఎస్ఏ బయో, జెడ్పీహెచ్ఎస్ జగ్గయ్యపేట), ఎస్. అనిల్ (ఎస్జీటీ, ఎంపిపిఎస్ కొత్తపల్లి) బాధ్యతలు స్వీకరించారు.జిల్లా కౌన్సిలర్‌గా జి. శంకర్ నాయక్ (ఎస్ఏ ఇంగ్లీష్, జెడ్పీహెచ్ఎస్ చిన్న కొడపాక), ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఏ. జ్యోతి (ఎస్జీటీ, ఎంపిపిఎస్ వెంకటేశ్వర్లపల్లి), సభ్యుడిగా పి. సంతోష్ (ఎస్జీటీ, ఎంపీయూపీఎస్ చెన్నాపూర్) ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి



కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, రెండవ పీఆర్సీ అమలు చేయాలని, 317 జీఓ సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులు మరియు ఇతర బకాయిలను తక్షణమే



చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు,సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

## అరైవ్ అలైవ్" ద్వారా రహదారి భద్రతపై అవగాహన--ఎస్సై డి. సుధాకర్ సూచనలు



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేగొండ మండలంలో నిర్వహించిన సమావేశంలో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రేగొండ ఎస్సై డి. సుధాకర్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఎస్సై డి. సుధాకర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నివారించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం అవసరమని పేర్కొన్నారు. బైక్‌పై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలి అని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్ట విరుద్ధమని, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు.వాహనాలు ఎల్లప్పుడూ సక్రమ స్థితిలో ఉండేలా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో,ఎంపీడీవోతో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందినట్లు అధికారులు తెలిపారు.

## కె సి ఆర్ సభ ఏర్పాటుకై జగిత్యాల లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సభ ఏర్పాటు

**- మూడు నెలల్లోనే పిల్లలు పుడతారా అని రేవంత్ రెడ్డి అడగడం విడ్డూరంగా ఉంది**

**- మూడు నెలల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పింది మీరు కాదా? అని ఆయన ప్రశ్నించారు**



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట ఏప్రిల్ // 16**

జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం లోని గంగాధర. రామడుగు, చొప్పదండి మండలాలలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో మాజీ శాసనసభ్యులు సుంకే రవి శంకర్ తో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



రావడం తో ప్రజలు కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో మూడు నెలల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అమలు చేయలేక రేవంత్ రెడ్డి మాట మారుస్తున్నాడు. పది సంవత్సరాలు కె సి ఆర్ పాలన తెలంగాణ ప్రజలు మళ్ళీ కోరుకుంటుంటారు. కేసీఆర్ తెలంగాణను కడుపులో పెట్టుకుని చూసుకుంటే, రేవంత్ రెడ్డి మాత్రం అబద్ధాలనే పాలసీగా మార్చుకుని ప్రజలను మోసం చేస్తున్నారని ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్తే తమ చెప్పులు ఎక్కడ ఎత్తుకుపోతారో అని ఢిల్లీ వారు భయపడే పరిస్థితి వచ్చిందని రేవంత్ రెడ్డి స్వయంగా అనడం ఆయన స్థాయిని తెలియజేస్తోందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు నేడు కేసీఆర్ పాలనను



కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీన జగిత్యాలలో నిర్వహించనున్న భారత రాష్ట్ర సమితి (బి ర్ స్) అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు బహిరంగ సభను చొప్పదండి నియోజకవర్గం నుండి వేలాది గా తరలివచ్చి విజయవంతం చేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ పిలుపునిచ్చారు. ఈ దుర్మార్గపు పాలనను అంతమొందించడానికి జగిత్యాల సభ తొలి అడుగు కాబోతుందని, ప్రజలందరూ ఏకమై కేసీఆర్ ని మళ్ళీ ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కుంటుపడిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలమయంగా మారిందని, ఈ దుర్మార్గపు పాలనను అంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ఆదివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం"




**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్16(తెలుగుగళం)న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం వి.ఏం. బంజర్ లో శ్రీ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో ఆదివారం అనగా ఈ నెల 19 న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని

స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడిందని సదవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని శ్రీ రాజ సాయి మందిరం నిర్వాహకులు జెన్నారెడ్డి విజయ నరసింహారెడ్డి,చైర్మన్ నీలాపు ఉమారాణి లు తెలిపారు.కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు కాకినాడ కు చెందిన శ్రీ కిరణ్ నేత్ర వైద్యశాల నిపుణులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారనీ తెలిపారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించడంతో పాటు, అవసరమైతే కంటి శుక్లాల ఆపరేషన్లు కూడా చేయబడతాయని నిర్వాహకులు తెలిపారు.

గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

మరిన్ని వివరాలకు 9866710909, 900709283 నంబర్లను సంప్రదించవచ్చు.

## చౌడవరంలో సాయి గణేష్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం"

**వేంసూరు,ఏప్రియల్16(తెలుగు గళం) న్యూస్:ఖమ్మంజిల్లా**

వేంసూరు మండలం చౌడవరం గ్రామపంచాయతీ పరిధిలోని సాయిగణేష్ వీవోలో 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు,సర్పంచ్ నల్లిబెల్లి అంజమ్మ లు రిబ్బన్ కటింగ్ చేసి తుకాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్మి న్యాయమైన ధర పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో: గ్రామ పెద్దలు,రైతులు, కమిటీ సభ్యులు,ఐకెపి ఏపీఎం సుబ్బారావు,సీసీలు, వీవోఏలు హాజరయ్యారు.





# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి:కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు







**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లాలో నిర్వహించనున్న పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మేడిగడ్డ కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం కాటారం మండలం నస్తూరుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని సూచించారు.నస్తూరుపల్లి బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని,సభా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డీపీవోకు ఆదేశించారు.ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్లు, బారికేడింగ్ ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు.అలాగే సభా ప్రాంగణంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ప్రాంతాల్లో తగిన లైటింగ్,తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక వైద్య కేంద్రాలు, అంబులెన్సులు, సేఫ్ హౌస్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను కూడా సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. కాళేశ్వర దేవాలయ పరిసరాల్లో విద్యుద్దీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఓను ఆదేశించారు.ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలపై ధృవీకరణ నివేదికలు సమర్పించాలని సూచించారు.ఏప్రిల్ 19, 20 తేదీలలో ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని,విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు తప్పనిసరిగా జారీ చేయాలని తెలిపారు.సమావేశానికి ముందు అధికారులు కాళేశ్వరం,నస్తూరుపల్లిలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో హరికృష్ణ, కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చౌడవరం లో ధాన్యం కొనుగోలు కేంద్రశీ ప్రారంభం'

-- తెలుగు గళం వార్తకు స్పందన"
-- రైతులకు ఉపయోగపడేలా చర్యలు"




తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

దళారుల దగా కు మేము గురి కావాలా?

చౌడవరం లో ఐకెపి ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభానికి నోచుకోక రైతులు ఇబ్బందులు"

వేంసూర్ ఏప్రిల్ 14 (తెలుగు గళం )న్యూస్:సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో గల చౌడవరం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంకను ప్రారంభించకపోవడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల నుంచి వడ్లు ఆరబోసి ఉన్నామని, అధికారులు ఇంకను కొనుగోలు ప్రారంభించలేదని, వాతావరణం మార్పులు వలన వర్షాలు కురిస్తే ధాన్యం పాడై ముక్కిపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షానికి పాడైతే ఆ రైతు వేదన వర్ణనాతీతం. అందువలన అధికారులు తొందరగా స్పందించి కొనుగోలు కేంద్రం ప్రారంభించి వడ్లు కొనుగోలు చేస్తే రైతుల ఇబ్బందులు తొలుగుతాయని, రైతులకు ఉపశమనం కలుగుతుందని, మీడియా వద్ద తమ బాధను తెలియజేసినారు. ఐకెపి సంబంధిత అధికారి ఏపిఎం ని దీని గురించి వివరణ కోరగా గురు,శుక్రవారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.ఏ పిఎం సుబ్బారావుని రైతులు అడుగగా డ్వాక్రా మహిళల సహకారంతోనే వడ్లు కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకొని కొనుగోలు కేంద్రం త్వరగా ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు. ధాన్యాన్ని బయట కొనుగోలుదారులకి అమ్మాలంటే చాలా తక్కువ రేటుకే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. వడ్లకు మంచి గిట్టుబాటు ధర రావాలంటే దళారులను నమ్మకుండా ప్రభుత్వానికి నేరుగా అమ్మితేనే రైతులు లాభపడతారని రైతులు తెలుపుతున్నారు.ఈ కార్యక్రమంలో:చౌడవరం సర్పంచ్ నల్లిపోయిన అంజమ్మ చిన్నకృష్ణ, ఉప సర్పంచ్ గొర్ల సత్యనారాయణరెడ్డి, రైతు సంఘం సభ్యులు తక్కెళ్ళపాటి శేషయ్య, మారిశెట్టి నరసింహారావు, చెరుకు ప్రతాపరెడ్డి, జంగా జమలయ్య, రామదాసు, మాదాసు సత్యం,లక్కన బోయిన నాగేశ్వరావు,అట్లా వెంకటేశ్వరరావు, నిడిగొండ లక్ష్మణరావు, సిద్దిన బోయిన వీర్రాజు, పసుమర్తి హనుమంతరావు, మాదాసు తాతయ్య, నాగా నరసింహాస్వామి, నల్లిపోయిన బాలకృష్ణ, మొగలపువ్వు కృష్ణయ్య, ఇడుపులపాటి దుర్గయ్య, పాలగాని చిన్నోడు పాల్గొన్నారు.

సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

Main Edition - April 15, 2026 - Page 1
https://telugugalam.com/clip/3123

**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రిల్ 16(తెలుగుగళం)న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం చౌడవరం గ్రామంలో ఎట్టకేలకు గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రశీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు ప్రారంభించారు.బుధవారం తెలుగుగళం తెలుగు జాతీయ దినపత్రిక లో "దళారుల దగాకు మేము గురి కావాలా" అనే వార్త ప్రచురితం అయిన విషయం పాఠకులకు విదితమే.కథనం వెలువడిన మరుసటి రోజే ప్రారంభం చేయడం తెలుగుగళం వార్త కు స్పందనగా మారింది. సత్తుపల్లి శాసన సభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు ఈ కేంద్రశీ ను ప్రారంభించినట్లు దోమ తెలిపారు.ఈ సందర్భంగా దోమ ఆనంద్ బాబు మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
రైతులు ధాన్యం తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. తేమ ప్రమాణాలు, తూకం వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో: కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణరెడ్డి,కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది,గ్రామ పెద్దలు పాల్గొన్నారు. రైతులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కేంద్రం ప్రారంభాన్ని స్వాగతించారు.

# కాళేశ్వర ఆలయాల పునరుద్ధరణకు వేగం పెంచాలి-- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాలు





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం**
కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం మరియు శుభానంద దేవి అమ్మవారి ఆలయాల పునరుద్ధరణ, పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు.గురువారం కాళేశ్వరం త్రివేణి విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, దేవాదాయ శాఖ ఈఓ మహేష్, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షించిన కమిషనర్, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూనే పనులను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు.ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలయ పునఃప్రతిష్ఠ పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో శిలాఫలకం ఏర్పాటు, భూమి పూజ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అనంతరం కమిషనర్ హనుమంతరావు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అలాగే శుభానంద దేవి, సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి చేపట్టనున్న పలు నిర్మాణ, పునరుద్ధరణ పనులపై ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ సమగ్ర వివరాలు అందించారు.కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొని ఏర్పాట్లను సమీక్షించారు.

# ‘ఉపాధి హామీలో రెండు పూటలా ఫొటో క్యాప్చర్ విధానం తీసేయాలి’



కనగల్, ఏప్రిల్ 16 : ఉపాధి హామీలో రెండు పూటలా ఫొటో క్యాప్చర్ విధానం తీసి వేయాలని, ఈ నెల 21 నుండి మండలాల ముందు జరుగు ధర్నాలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పిలుపునిచ్చారు. గురువారం కనగల్ మండలంలోని లింగోటం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నోసంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు పనైనా చూపండి, తిండి అయినా పెట్టండి అనే నినాదంతో పోరాటాలు నిర్వహించిన ఫలితంగా 2005లో యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్ష పార్టీల ఒత్తిడి ఫలితంగా ఉపాధి హామీ సాధిస్తే 2014 నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీకి రోజురోజు బడ్జెట్‌లో కోతలు విధిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేటటువంటి చర్యలకు మోదీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు.కోట్లాది మంది ఉపాధి కార్మికుల బ్రతుకులను అపహాస్యం చేసేటటువంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకున్నదని ఉపాధి హామీ పనిచేస్తే అనేక రకాలైన ఆంక్షలు కూలీలపై పెడుతూ పొద్దస్తమానం పనిచేస్తే రూ.100 నుండి 150 కు కూడా కూలి గిట్టుబాటు కావడంలేదని ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ కోట్లాదిమంది ప్రజల పై ఆర్థిక భారాలు మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంలోకి యంత్రాలు రావడంతో కార్మికులకు పనులు పూర్తిగా తగ్గిపోయాయిలంగాణ రాష్ట్రంలో 50 లక్షలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయని, కోటి 20 లక్షల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారని ఇందులో 10 శాతం మందికి కూడా పనులు చూపించలేకపోతున్నారని అందరికీ పని కల్పించే పద్ధతులు చర్యలు చేపట్టాలని, కొత్తగా తెచ్చిన విపిజి రాంజీ బిల్లును వెనక్కి తీసుకొని ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని చట్టాన్ని అమలు చేసినటువంటి బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని రాష్ట్రాల పైకి నెట్టి కార్మికులకు ఉపాధి దూరం చేయొద్దని కోరారుకేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ దేశంలోనే అణగారిన వర్గాలు ఒక పూట తిండి తిని మరో పూట పస్తులు ఉన్నటువంటి ప్రజానీకం పట్ల వారికి ఉన్నటువంటి సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేయకుండా కులం మతం రంగులు మారుస్తూ ప్రజల మధ్య అనేక వైశాల్యాలను ఎంచి పోషిస్తూ తన పరిపాలనను కొనసాగిస్తుందని ఇలాంటి దుర్మార్గాలు మరెన్నో రోజులు సాగవని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు నత్త నడకన జరుగుతున్నాయని అధికార యంత్రాంగం ఉపాధి హామీ పనుల పట్ల పూర్తి శ్రద్ధ వహించి జిల్లాలోని కార్మికులందరికీ పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని 125 రోజుల నుండి 200 రోజులకు పని దినాలను పెంచాలని పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా రోజు కూలి 800 ఇవ్వాలని అట్లాగే మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ పేదలందరికీ ఉపాధి హామీ ద్వారా పని కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 నుండి 25 వరకు మండలాల ముందు జరుగు ధర్నాలో కార్మికులంతా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దుర్గయ్య ఉపాధి కార్మికుల సంఘం గ్రామ అధ్యక్షుడు ఓర్సు పెద్దులు కార్యదర్శి మట్టిపల్లి మౌనిక, సంఘ నాయకులు దాసరి లక్ష్మమ్మ. కోరే యాదమ్మ, దాసరి మహేష్, మట్టిపల్లి పాపమ్మ పైళ్ల సుధాకర్, నర్సింగ్ లక్ష్మమ్మ, కోరే వినోద, గునాలపూరి అలివేలు, ఆదిమల్ల యాదమ్మ, చెరుకుపల్లి మమత, మట్టిపల్లి వెంకటమ్మ, పైల్లా శీను పాల్గొన్నారు.

# జాతీయ క్రికెటర్ పసుల రాజు క్రికెట్ ప్రాక్టీస్ పిచ్ ప్రారంభం

**రేగొండ ఎస్సై డి.సుధాకర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో క్రీడా రంగానికి ప్రోత్సాహం అందించే దిశగా కీలక ముందడుగు పడింది.జాతీయ స్థాయి మూగ క్రికెట్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటుతున్న యువ క్రీడాకారుడు పసుల రాజు ఏర్పాటు చేసుకున్న క్రికెట్ ప్రాక్టీస్ పిచ్‌ను రేగొండ సబ్ ఇన్స్పెక్టర్ డి. సుధాకర్ బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై డి. సుధాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రాక్టీస్ పిచ్‌ను ప్రారంభించి, స్వయంగా కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ శారీరక వైకల్యాన్ని అడ్డంకిగా భావించకుండా పట్టుదలతో జాతీయ స్థాయికి ఎదిగిన పసుల రాజు యువతకు ఆదర్శప్రాయుడని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లాలని సూచించారు.క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయని, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు భావన వంటి విలువలను నేర్పిస్తాయని ఎస్సై పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి ప్రాక్టీస్ సదుపాయాలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఈ పిచ్ ద్వారా మరింత మంది యువకులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెద్దంపల్లి సర్పంచ్ గడ్డె రఘు, ఉప సర్పంచ్ సకినాల రవీందర్, రేగొండ బీఆర్ఎస్ టౌన్ యువజన అధ్యక్షులు మాడగాని నరేష్, క్రీడాభిమానులు తదితరులు పాల్గొని పసుల రాజును ఘనంగా సన్మానించారు. ఈ ప్రాక్టీస్ పిచ్ అందుబాటులోకి రావడంతో స్థానిక క్రికెట్ క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు.

# బేగంపేట కిమ్స్ సన్‌షైన్‌లో మరో మైలురాయి - న్యూరోసర్జరీల్లో రోబోటిక్ మైక్రోస్కోప్ సేవలకు శ్రీకారం



శరీరంలో వ్యాధులు వచ్చే సందర్భాల్లో సర్జరీలు చేయాల్సి వస్తుంది. అయితే ఆపరేషన్ సమయంలో వైద్యులు చిన్నపాటి తప్పిదాలు చేసినా అది అనేక అనర్థాలకు దారి తీస్తుంది. అయితే ఈ సమస్యలను అధిగమించేందుకు ఆస్పత్రులు ఎప్పటికప్పుడు సాంకేతికతను వినియోగించుకుంటాయి. దీనిలో భాగంగా న్యూరోసర్జరీల్లో కీలకమైన రోబోటిక్ మైక్రోస్కోప్‌ను బేగంపేటలోని కిమ్స్ సన్?షైన్ ఆస్పత్రి అందుబాటులోకి తెచ్చింది.కీలక మైలురాయి : రోబోటిక్ సర్జరీలంటేనే ఖచ్చితత్వానికి పెట్టింది పేరు. అందులో మరింత ఆధునిక జైస్ కినెవో 900 రోబోటిక్ మైక్రోస్కోప్‌ను బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి అందుబాటులోకి తెచ్చింది. న్యూరోసర్జరీల్లో ఇది మరో కీలక మైలురాయి అని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గురవా రెడ్డి పేర్కొన్నారు. బేగంపేటలోని కిమ్స్ సన్?షైన్ ఆస్పత్రిలో ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ సి. హెచ్.గోపాల్?తో కలిసి ఆయన పాల్గొన్నారు.క్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సల్లో మెరుగైన ఫలితాలు : ఈ సందర్భంగా కిమ్స్ సన్?షైన్ ఆస్పత్రి ఎండీ డా. గురవారెడ్డి మాట్లాడారు. ఈ అత్యాధునిక పరికరంతో క్లిష్టమైన మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇలాంటి ఆధునిక రోబోటిక్ మైక్రోస్కోప్ దేశవ్యాప్తంగా కొద్ది కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు."బ్యూరో సైన్స్ డిపార్ట్‌మెంట్‌కి ఓ నూతనమైన రోబోటిక్? మైక్రోస్కోం అందుబాటులోకి వచ్చింది. దీనిని జైస్? సంస్థ రూపొందించింది. ఇలాంటి మైక్రోస్కోప్‌లు భారత్ మొత్తంలో 4 ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇది బ్రెయిన్? ట్యూమర్‌ను సేఫ్‌గా తీయటానికి బాగా ఉపయోగపడుతుంది. దీనివల్ల రోగుల భద్రత ఎక్కువగా ఉంటుంది. దీనిలో లాకింగ్? మెకానిజం ఉంటుంది. పైగా ఇది ఏ ఆపరేషన్ చేస్తుంది అనే విషయాలను పెద్ద స్క్రీన్?పై త్రీడీ యానిమేషన్‌లో కనిపిస్తుంది. బ్రెయిన్ ట్యూమర్? తీసే క్రమంలో సున్నితమైన ప్రాంతాల్లోనూ కచ్చితంగా పని పూర్తి చేస్తుంది" – డా.గురవా రెడ్డి, కిమ్స్ సన్?షైన్? ఆస్పత్రి ఎండీమరింత కచ్చితత్వంతో సులభంగా శస్త్రచికిత్సలు : కినెవో 900 రోబోటిక్స్ హై–డెఫినిషన్ ఇమేజింగ్ స్మార్ట్ ఫీచర్లను సమన్వయం చేసి శస్త్రచికిత్సల సమయంలో వైద్యులు మరింత కచ్చితత్వంతో సులభంగా శస్త్రచికిత్సలు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. రోబోటిక్స్?గా పిలిచే ఈ యంత్రాన్ని బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకురావటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

బ్రెయిన్ ట్యూమర్లు తొలగించేందుకు ఇదే బెస్ట్ : గంటల తరబడి శస్త్రచికిత్సలు చేయాల్సిన వచ్చినప్పుడు ఈ రోబోటిక్ విధానంలో త్వరగా ఆపరేషన్? పూర్తి చేయవచ్చు అని గురవారెడ్డి తెలిపారు. ముఖ్యంగా వాస్క్యులర్ న్యూరోసర్జరీలో ఇది ఎక్కువగా ఉపయోగపడుతుందని చెప్పారు. బ్రెయిన్ ట్యూమర్లు తొలగించే సందర్భంలో పక్కన ఉండే మెదడు కణజాలం దెబ్బతినకుండా ఈ రోబోటిక్ సహాయంతో అత్యంత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స చేయవచ్చని వివరించారు.

"రోబోటిక్ సాయం లేకుండా ట్యూమర్?కు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయకూడదు. వీటిని నిర్వహించే సమయంలో చిన్న తప్పు జరిగినా శరీరంలో కొన్ని భాగాలు దెబ్బతింటాయి. పెరాలసిస్ వంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అయితే ఈ రోబోటిక్? సాయంతో వాటన్నింటినీ అధిగమించవచ్చు. దీని సాయంతో 90 శాతం సక్సస్ రేట్‌తో బ్రెయిన్ ట్యూమర్‌ను తొలగించ చేసే అవకాశం వచ్చింది" – డా.గురవా రెడ్డి, కిమ్స్ సన్?షైన్? ఆస్పత్రి ఎండీకిమ్ అంటేనే టెక్నాలజీ : టెక్నాలజీ పరంగా కిమ్స్ ఆస్పత్రులు? ఎప్పుడూ ముందంజలో ఉంటాయని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డా.గురవా రెడ్డి పేర్కొన్నారు. తమకు 26 ఆస్పత్రులున్నాయని సంవత్సరానికి 10 నుంచి 15 రోబోలను కొంటున్నట్లు వెల్లడించారు. గత వారంలో స్పైన్ రోబో అందుబాటులోకి వచ్చిందని, ఇప్పుడు తాజాగా అందుబాటులోనికి తీసుకువచ్చింది న్యూరో సర్జికల్ రోబోట్ అని వివరించారు.

# తెలంగాణలో 78 శాతం కుటుంబాల ఆదాయం రూ.లక్షలోపే..




తెలంగాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం.. ఎస్సీల్లో 97 శాతం.. బీసీల్లో 71 శాతం మంది ప్రజలు.. తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుకబడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కువగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా గం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన ఎరే కావడం గమనార్హం.ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలుసామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు ద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య చదువుతున్న వారిలో 57 శాతంతో అగ్రవర్ణాలు ముందుండగా.. 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు

# ఘనంగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల మండల సభ





**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

మరిపెడ మండల కేంద్రంలోని ఆడిటోరియంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల రెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల సభ కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ హాజరయ్యారు, మండల సభలో పాల్గొన్న కౌన్సిలర్లు, గ్రామపంచాయతీ సర్పంచులు తమ పరిధిలోని ప్రజలు తమ పరిధిలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు, 12వ వార్డు కౌన్సిలర్ గౌతంరెడ్డి తమ వార్డు పరిధిలో సిసి రోడ్లు అంతర్గతనం అభివృద్ధి పనులు చేయవలసిందిగా కోరారు, వీరారం ఏడవ వార్డు లో బోర్ రిపేర్ చేయాలని కోరారు, బాల్య తండ సర్పంచ్ కెనాల్ పనులు పూర్తి చేయాలని కోరారు, నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు చేయాలనీ కోరారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ట ఆత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న 99 రోజుల పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా (10) థీమ్ ల వారిగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, రోడ్ సేఫ్టీ, హెల్మెట్ సీట్ బెల్ట్, రవాణా భద్రతపై ఈ వారం రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతిరోజు ఒక అంశంపై జిల్లా ఎస్పీ శబరిష్, జిల్లా అధికారులు రవాణా శాఖ సిబ్బంది విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు, గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలోని యువత చెడు సహవాసాలకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని అలాంటి సంఘటనలు ఏమైనా ఉంటే తెలియపరచి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు, మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా ప్రమాదాలు జరిగే మరిపెడ ప్రాంతంలో ఈ కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఉండాలని సూచించారు, పట్టణంలోని క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని తెలిపారు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లో ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై ఎవరైనా సిబ్బంది గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలను ఇబ్బంది పెట్టి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, మరిపెడ మండలం లో ఇరిగేషన్, త్రాగునీరు, సానిటేషన్, హెల్త్ ,ఎడ్యుకేషన్ తదితర అంశాలలో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు,ఈ మండల సభలో పాల్గొని వివిధ సమస్యలను వినతులను సమర్పించిన వివరాలను స్వీకరించి వెంటనే పరిష్కరిస్తామని అట్టి సమాచారాన్ని తెలియపరచడం జరుగుతుందని అన్నారు, వరి పంటలు కాకుండా ఇతర వాణిజ్య పంటల వైపు రైతులను ముగ్గు చూపే విధంగా చర్యలు తీసుకోవాలని, అధిక శాతం యూరియా వాడితే ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు, కావున ప్రజా ప్రతినిధులు ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు,సేంద్రియ ఎరువుల వైపు రైతులు ముగ్గు చూపే విధంగా చూడాలని రైతులు కూడా బాధ్యత అధికంగా కెమికల్స్ ఫర్టిలైజర్స్ ను తగ్గించాలన్నారు,నానో యూరియా ఇతర ప్రత్యామ్నాయ మందులను వాడాలని సేంద్రియ ఎరువులు మంచివని తెలిపారు, ప్రతి ఒక్కరూ ఒక నిర్ణయం తీసుకొని ఆర్గానిక్ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, ఎస్పీ ఎలాగైతే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో ప్రతి ఒక్కరు సర్పంచులు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా నిర్ణయించుకుని సమాజం బాగు యువత సన్మార్గంలో నడవడానికి కంకణ బద్ధులై పని చేయాలన్నారు,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించే (10) థీమ్ లో ప్రస్తుతం నడుస్తున్న రోడ్డు భద్రత కార్యక్రమాలు, రానున్న డ్రగ్స్ నివారణ కార్యక్రమాలను చైతన్యవంతంగా నిర్వహించాలని, ఇప్పటికే గ్రామ సభలు, మండల సభలు నిర్వహించి వచ్చే నియోజకవర్గస్థాయి సమావేశంలో ఇట్టి సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని అన్నారు,ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ విజయనంద్, తాసిల్దార్ కృష్ణవేణి, అగ్రికల్చర్ ఏవో వీరాసింగ్, హౌసింగ్, మున్సిపల్ ఏఈలు ఉషా కీర్తి, శృతి, మండల వైద్యాధికారి డాక్టర్ రవి,ఎంఈఓ అనిత, సిడిపిఓ ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయ వ్యాపారస్తులను మోడల్ మార్కెట్లోకి మార్చాలి

**నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి**





**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**


వీధుల్లో ఉన్న చిరు కూరగాయ వ్యాపారస్తుల్ని వెంటనే మోడల్ మార్కెట్ లోకి మార్చాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మరియు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ ను సిపిఐ బృందం సందర్శించి ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి 2022లో అందుబాటులోకి తెచ్చిన మోడల్ మార్కెట్ ని కూరగాయ వ్యాపారస్తులు కొన్ని రోజులు మాత్రమే ఉపయోగించుకొని తిరిగి వీధుల్లో వ్యాపారం చేయడం వలన వాహనదారులు, షాప్ వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. నూతన పాలకమండలి దృష్టిసారించి నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ ను వ్యాపారస్తులు ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని , అదేవిధంగా చేపలు అమ్ముకునే వారికి కూడా అదే మార్కెట్లో కొంత స్థలం కేటాయించాలని కోరారు సంత నుండి బయటకు వెళ్లడానికి వెనుక వైపు ఉన్న దారిని తిరిగి ఉపయోగం లోకి తీసుకు రావడం పై దృష్టి పెట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, తురక రమేష్ తదితరులు పాల్గొన్నారు

# కల్లూరులో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ సుడిగాలి పర్యటన"

**- సహాయ కార్యక్రమాలు, సమావేశాలతో బిజీ షెడ్యూల్"**









**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రిల్ 16(తెలుగుగళం)న్యూస్:**

సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ గురువారం కల్లూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ప్రజాపాలన–– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కల్లూరు మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో కార్మికులకు నిత్యావసర సరుకులు, భద్రతా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం రెండో వార్డులో కప్పలబంధం రోడ్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.అంబేద్కర్ రోడ్డులో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.51.33 లక్షల స్కాలర్షిప్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వ్యాలీ, ప్రతినిధి రామారావును అభినందించారు.రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రణాళికలు గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.రఘునాథ బంజర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు 14 డబుల్ డెస్క్ బెంచీలను అందజేశారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.బోడేమల్లె గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమాల్లో: మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

## ఆపద్బాంధవుడు హీరోయిన్ 'ఔరా అమ్మక చెల్లా' సాంగ్ రీక్రియేషన్ చూశారా..




విశ్వనాథ్ డైరెక్షన్‌లో చిరంజీవి, మీనాక్షి శేషాద్రి కాంబోలో వచ్చిన ఆపద్భాంధవుడు సినిమాలోనిదని తెలిసిందే.సినిమా వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఈ పాటకున్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. సాంగ్‌లో చిరంజీవి, మీనాక్షి శేషాద్రి డ్యాన్స్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ ఆ పాటను రీక్రియేట్ చేసింది మీనాక్షి

ఔరా అమ్మక చెల్లా.. ఆలకించి నమ్మటమెల్లా.. అంత వింత గాథల్లో ఆనందలాలా..! ఈ ఆల్‌టైమ్ ఎవర్ గ్రీన్ సూపర్ హిట్ సాంగ్ తెలియని తెలుగు మూవీ, మ్యూజిక్ లవర్ ఉండరంటే అతిశయోక్తి కాదు. ఈ పాట కె శేషాద్రి. 62 ఏండ్ల వయస్సులోనూ లంగావోణిలో హొయలు పోతూ ఆనాటి రోజులను గుర్తు తెచ్చేలా మీనాక్షి చేసిన డ్యాన్స్ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

## అయ్యప్ప భక్తుల మధ్యలో పోలీస్ ఆఫీసర్.. ఆకట్టుకుంటున్న మోహన్ లాల్ కొత్త సినిమా లుక్


మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ వరుస ప్రయోగాలతో బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తున్నారు. గతేడాది 'తుడరుమ్' చిత్రంలో ట్యాక్సీ డ్రైవర్‌గా, 'హృదయ పూర్వం' లో ప్రేమికుడిగా వైవిధ్యమైన నటనతో మెప్పించిన ఆయన, ఇప్పుడు ఖాకీ చొక్కా ధరించి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తరుణ్ మూర్తి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రానికి 'అతిమనోహరం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 'తుడరుమ్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.మలయాళీల నుతన సంవత్సర పండుగ అయిన 'విషు' రోజున ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన చేసింది. ఈ పోస్టర్‌లో శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వామి భక్తుల మధ్య మోహన్ లాల్ పోలీస్ యూనిఫాంలో గంభీరంగా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఇందులో ఆయన 'లవ్ లాజన్' అనే విభిన్నమైన పాత్రను పోషిస్తుండటం విశేషం. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాతో పాటు మోహన్



లాల్ చేతిలో 'పేట్రియాట్', అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'దృశ్యం 3' వంటి క్రేజీ ప్రాజెక్టులు కూడా ఉండటంతో మాలీవుడ్ వర్గాల్లో సందడి నెలకొంది.


## రక్తంతో తడిసిన చదరంగం.. సరికొత్త అవతారంలో సందీప్ కిషన్ 'పవర్ పేట' అనౌన్స్‌మెంట్

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ చిత్ర పరిశ్రమలో 16 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తన తదుపరి భారీ ప్రాజెక్ట్ 'పవర్ పేట'ను అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి గతంలో పలువురు యంగ్ హీరోల పేర్లు వినిపించినప్పటికీ, చివరికి ఈ పవర్‌ఫుల్ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో సందీప్ కిషన్ కథానాయకుడిగా ఖరారయ్యారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని 70ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. "ప్రతి కదలికకు ఒక ధర ఉంటుంది"




అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా ప్రేమ, గౌరవం మరియు రాజకీయాల చుట్టూ తిరిగే కథతో ఉండబోతోంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, సాంకేతిక రంగంలో దిగ్గజాలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందిస్తుండగా, మధి సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రక్తంతో తడిసిన చదరంగం బోర్డు మరియు విరిగిన పావులను చూపించడం సినిమాలోని ఇంటెన్సిటీని తెలియజేస్తోంది. ఒక సామాన్యుడు రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడిగా ఎదిగే క్రమాన్ని ఈ సినిమాలో ఎంతో లోతుగా చూపించబోతున్నారని సమాచారం.

## 'తస్సాదియ్య' అంటూ స్టెప్పులేసిన సమంత.. 'మా ఇంటి బంగారం' ఫస్ట్ సాంగ్ రిలీజ్




స్టార్ హీరోయిన్ సమంత రుత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై ఈ సినిమాను నిర్మిస్తుండగా.. తాజాగా ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ 'తస్సాదియ్య' వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి అద్భుతమైన బాణీలు అందించగా.. 'తస్సాదియ్య' పాట ఒక ఫ్యామిలీ పార్టీ జోష్ నింపుతోంది.

## అఖిల్ 'లెనిన్' నుంచి అదిరిపోయే అప్‌డేట్.. 'ఎట్టా ఎట్టా' సాంగ్ వచ్చేసింది!


అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లెనిన్' నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'ఎట్టా ఎట్టా' వీడియో సాంగ్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. భాస్కరభట్ల ఈ పాటకు సాహిత్యం అందించగా.. థమన్, ఎస్ శ్రీ కృష్ణ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు. సాహిత్యంకిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున,




వంశీ ఐరటనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన మాస్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న .

## నిఖిల్ 'స్వయంభూ' నుంచి మొదటి పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ' . ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు



విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై
భారీ స్థాయిలో సందడి చేయనుంది.

## తాతకే షాక్ ఇచ్చిన మనవడు.. మోహన్‌బాబును ఆటపట్టించిన చిన్నారి అవ్రామ్

వెండితెరపై క్రమశిక్షణకు, గంభీరమైన వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచే 'కలెక్షన్ కింగ్' మంచు మోహన్‌బాబును ఆటపట్టించాడు అతడి మనవడు అవ్రామ్. మంచు విష్ణు కుమారుడు, మోహన్‌బాబు మనవడు అయిన అవ్రామ్ భక్త మంచు తన తాతయ్యను ఆటపట్టించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

సాధారణంగా మోహన్‌బాబు గొంతు సవరించారంటేనే అందరూ ఎంతో వినయంగా, నిశ్శబ్దంగా ఉంటారు. కానీ, ఈ వీడియోలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అవ్రామ్ అల్లరి చేస్తున్న సమయంలో మోహన్‌బాబు నెమ్మదిగా



సైలెంట్‌గా ఉండాలని వారించినా, ఆ చిన్నారి అస్సలు తగ్గలేదు. పైగా తాతయ్యనే అనుకరిస్తూ ఎంతో ముద్దుగా 'ఏంటీ బాబూ..' అంటూ ఎదురు ప్రశ్నించి నవ్వులు పూయించాడు. చివరకు తన అల్లరితో తాతయ్యను మురిపించి, ఎంతో స్టైల్‌గా 'బై బాబూ' అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఎంతటి కఠినమైన క్రమశిక్షణ గల వారైనా మనవడి అల్లరి ముందు మెత్తబడాల్సిందేనని ఈ వీడియో నిరూపిస్తోంది. తన మనవడి మాటలకు మోహన్‌బాబు ముసిముసి నవ్వులు చిందిస్తూ ఉండిపోవడం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ క్యూట్ వీడియో చూసిన అభిమానులు తాతకు తగ్గ మనవడు, డైలాగ్ కింగ్ ముందే డైలాగులు కొడుతున్నాడుగా అంటూ కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు.

## ఓటీటీలోకి వచ్చేసిన 'ఉస్తాద్ భగత్ సింగ్'.. నెట్‌ఫ్లిక్స్‌లో పవర్ స్టార్ మాస్ జాతర మొదలు

మెగా అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ యాక్షన్ డ్రామా 'ఉస్తాద్ భగత్ సింగ్' డిజిటల్ ఎంట్రీ ఇచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో గురువారం (ఏప్రిల్ 16, 2026) నుండి ఈ చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది. మార్చి 19న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా సరిగ్గా ఐదు వారాల తర్వాత బుల్లితెర ప్రేక్షకులను పలకరిస్తోంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా భారీ ఓటీటీ డీల్‌ను సొంతం చేసుకోవడం విశేషం. తెలుగుతో పాటు ప్రధాన దక్షిణాది భాషలు మరియు హిందీలో కూడా ఈ చిత్రం అందుబాటులో ఉంది.పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ , మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్ అంటేనే ఒక వైబ్రేషన్. వీరిద్దరి కలయికలో 'గబ్బర్ సింగ్' తర్వాత వచ్చిన




'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఇప్పుడు డిజిటల్ వేదికపై సందడి చేస్తోంది. థియేట్రికల్ రన్ ముగించుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ వేదికగా గ్లోబల్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది.ఈ సినిమా బాక్సాఫీస్ ఫలితం ఎలా ఉన్నా పవర్ స్టార్ క్రేజ్ దృష్ట్యా నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ చిత్ర డిజిటల్ హక్కుల కోసం భారీ మొత్తాన్ని వెచ్చించింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం సుమారు 80 కోట్లకు ఈ డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. కేవలం 20 నిమిషాల్లోనే ఈ భారీ ఒప్పందానికి నెట్‌ఫ్లిక్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే వార్త అప్పట్లో ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. గురువారం నుండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రైబర్లు తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ఆయన సంధించే తూటాల్లాంటి డైలాగులు, రాజకీయ వ్యంగ్యాస్త్రాలు అభిమానులకు పూనకాలు తెప్పిస్తాయి.

## మిల్కీ బ్యూటీకి మద్రాస్ హైకోర్టులో షాక్: 15 ఏళ్ల న్యాయ పోరాటం వృథా

స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాకు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. ఓ సబ్బుల కంపెనీతో సాగుతున్న సుదీర్ఘ న్యాయ వివాదంలో ఆమెకు నిరాశే ఎదురైంది. ఒప్పందం ముగిసిన తర్వాత కూడా తన ఫోటోలను వాడుకున్నారంటూ తమన్నా వేసిన కోటి రూపాయల నష్టపరిహారం పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. ఆమె సమర్పించిన ఆధారాల్లో స్పష్టత లేదని కోర్టు అభిప్రాయపడింది. 20 ఏళ్లుగా వెండితెరపై తన గ్లామర్‌తో అలరిస్తున్న తమన్నా ప్రస్తుతం ఓటీటీ ప్రాజెక్టులతో పాటు వైవిధ్యమైన సినిమాలతో బిజీగా గడుపుతున్నారు.

సినీ రంగంలో హీరో హీరోయిన్లకు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా భారీ ఆదాయం లభిస్తుంది. అయితే, కొన్నిసార్లు అవే బ్రాండ్లు చట్టపరమైన చిక్కులకు దారితీస్తాయి. సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు తమన్నా భాటియా . దాదాపు దశాన్నర కాలంగా ఆమె మద్రాస్ హైకోర్టులో చేస్తున్న పోరాటానికి తాజాగా తెరపడింది.

ఈ 'ప్రకటనల యుద్ధం' 2008లో మొదలైంది. అప్పట్లో తమన్నా క్రేజ్ మామూలుగా ఉండేది కాదు. ఆమె పాపులారిటీని చూసి 'పవర్ సోప్స్' అనే సంస్థ తమ ప్రచారకర్తగా ఒప్పందం చేసుకుంది. అగ్రిమెంట్



ప్రకారం 2009 అక్టోబర్ వరకు ఆమె చిత్రాలను వాడుకోవాలి. కానీ, గడువు ముగిసిన తర్వాత కూడా ఆ సంస్థ తమన్నా ఫోటోలను మార్కెట్లో వినియోగించిందని ఆమె తరపు న్యాయవాదులు ఆరోపించారు. దీనివల్ల ఆమెకు రావాల్సిన కొత్త బ్రాండ్ల అవకాశాలు దెబ్బతిన్నాయని, ఇందుకు పరిహారంగా రూ. 1 కోటి చెల్లించాలని 2010లో కోర్టు మెట్లెక్కారు.ఈ కేసు విచారణలో తమన్నా కొన్ని సబ్బు రేపర్లను, ఇంటర్నెట్ ఆధారాలను సాక్ష్యాలుగా చూపారు. అయితే, ఆ సబ్బులు అగ్రిమెంట్ గడువు ముగిసిన తర్వాతే తయారయ్యాయని నిరూపించడానికి బ్యాచ్ నంబర్లు లేదా కచ్చితమైన తేదీలు సరిగ్గా లేవని హైకోర్టు సింగిల్ బెంచ్ తేల్చిచెప్పింది. పైగా ఆమెకు జరిమానా కూడా విధించింది. దీనిపై ఆమె డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసినప్పటికీ అక్కడ కూడా ఆమెకు చుక్కెదురైంది. జస్టిస్ పి. వేల్మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం సింగిల్ బెంచ్ తీర్పునే సమర్థించింది. దీంతో 15 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తమన్నాకు నిరాశను మిగిల్చింది.కోర్టు కేసులు ఎలా ఉన్నా, తమన్నా తన కెరీర్‌ను మాత్రం అద్భుతంగా మలచుకున్నారు. 2005లో 'శ్రీ' సినిమాతో చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మారిపోయింది.


Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.